

గూండాల దర్జా!

ఇప్పటికీ పట్టుకోని పోలీసులు

శ్రీకృష్ణపై దాడి జరిగి ఆరు రోజులు
ఆచూకీ తెలిసినా..
అరెస్టుకు వెనుకంజ
పట్టుకొచ్చిన ఆ ఒక్కడికి రాచమర్యాదలు
పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు





మంత్రి అనుచరుడు అశోక్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గూండాలు ఎక్కడున్నారు...? వారికి రక్షణ కల్పిస్తున్నది ఎవరు...? ఒక్కరిని మాత్రమే అరెస్టు చశారు. మిగిలినవారిపై చర్యలెప్పుడు...? లోలోపల ఏమేం జరుగుతోంది..? ఇదీ.. జిల్లా ప్రజల్లో జరుగుతున్న చర్చ. సిద్ధం సభలో దాడి జరిగి ఆరు రోజులు గడిచింది. ఇప్పటికీ దాడి చేసినవారిని పోలీసులు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జర్నలిస్టు సంఘాలు, విపక్షాలు, ప్రజా, విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. ఎస్పీని కలిసి వినతి పత్రాలు సమర్పించాయి. జర్నలిస్టు సంఘాలు చలో అనంతపురం నిర్వహించాయి. రాష్ట్రస్థాయి నాయకులు వచ్చి ఎస్పీని కలిసి వెళ్లారు. దుండగులను అరెస్టు చేయాలని, జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

ఒక్కడిని మాత్రమే..

ఉరవకొండ మండలం మరుట్ల 2వ కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే ఇప్పటి వరకూ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మొత్తం ఆరుగురిని గుర్తించామని స్వయంగా ఎస్పీ అన్బురాజన్ ప్రకటన ఇచ్చారు. మిగిలినవారిని గుర్తిస్తామని కూడా తెలిపారు. గుర్తించిన ఆ ఆరుగురిలో మిగిలిన ఐదుగురిని ఎప్పుడు అరెస్టు చేస్తారు..? వీరు కాక, ఇంకా ఎంతమందిని గుర్తించారు అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. ఎవరెవరిని గుర్తించారో కూడా బహిర్గతం చేయడం లేదు. దాడి చేసినవారు పరారీలో ఉన్నారని పోలీసులు అంటున్నారు. కానీ బండి రవి లాంటివారు ఫోన్ ఎత్తి.. 'ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్నా..' అని పోలీసులకు లొకేషన్ పెట్టినా పట్టుకోలేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ నాయకుల ఒత్తిళ్ల కారణంగానే దుండగులను అరెస్ట్ చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆ గూండాలు దాక్కున్నారా...? లేక అధికారపార్టీ నేతలు దాచిపెట్టారా..? అంటే... రెండో ప్రశ్నకు అవునన్న సమాధానం వస్తోంది. దాడి చేసినవారు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నారు. 'మా ఊరివాడే..' అని స్థానికులు గుర్తించారు కూడా..! దాడిలో కుట్ర కోణాన్ని మాత్రమే పోలీసులు ఛేదించాల్సి ఉంది. దాడి చేసింది ఎవరో ఇప్పటికే తేలిపోయింది. పట్టుకుంటారా..? లేక బెయిల్ తెచ్చుకునేదాకా 'పరారీలో ఉన్నారు..' అని సన్నాయి నొక్కులు నొక్కుతారా అన్నది తేలాల్సి ఉంది. ప్రజల నుంచి వస్తున్న విమర్శలను తప్పించుకునేందుకు ఒక్కరిని అరెస్టు చేసి చేతులు దులిపేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అరెస్టు చేయకపోతే వదిలేది లేదని జర్నలిస్టు సంఘాలు, విపక్షపార్టీలు, ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి. పోలీసులు చర్యలు తీసుకోకపోతే మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని అంటున్నారు.

దర్జాగా తిరుగుతున్నారు..

ఎర్రిస్వామి అరెస్టు తరువాత మిగిలిన వారి అరెస్టులు త్వరలోనే ఉంటాయని అందరూ భావించారు. కానీ ఏ ఒక్కరినీ పట్టుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడఘట్టకు చెందిన గొల్ల అశోక్ కోసం పోలీసులు అతని ఇంటి వద్దకు వెళ్లారు. అతను లేకపోవడంతో బైక్‌ను తీసుకొచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఆ తరువాత అతనికోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. మరో వ్యక్తి కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర. ఇతను ఊరిలోనే తచ్చాడుతున్నాడని స్థానికులు అంటున్నారు. అయినా పోలీసులు అరెస్ట్ చేయలేకపోయారు. కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి రవి 'పట్టుకోండి చూద్దాం..' అని సవాలు విసురుతున్నాడు. అనంతపురం నగరంలోనే ఉన్నాడన్నది బహిరంగ రహస్యం. అయినా అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదు. వీరు కాకుండా, దాడిలో పాల్గొన్న మరికొందరిని పోలీసులు గుర్తించాల్సి ఉంది. టోపీ, కళ్ల జోడు పెట్టుకున్న వ్యక్తితో పాటు దాడి చేసిన ఓ మధ్య వయస్కుడు, వెనుక వైపు ఉండి కాలితో తన్నిన వ్యక్తుల ముఖాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్ల జోడు, టోపీ పెట్టుకున్న వ్యక్తి కడప జిల్లా సింహాద్రిపురంవాసి అని చెబుతున్నారు. ఇలా జనం గుర్తించడమేగానీ.. పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.



రాప్తాడు స్టేషన్ వద్ద విశ్వ గ్యాంగ్(ఫైల్)

మరీ ఇంత లొంగుబాటా..?

అంతర్రాష్ట్ర దొంగలు, సైబర్ నేరగాళ్లు కలుగులో దాక్కున్నా పట్టుకొచ్చిన ఘనత అనంతపురం జిల్లా పోలీసులది. ఇటీవల ఏకంగా జమ్మూ కశ్మీర్‌కు వెళ్లి సైబర్ నేరగాడు 'కింగ్ పిన్'ను పట్టుకొచ్చారు. కానీ పక్కా ఆధారాలు, ఆచూకీ తెలిసినా.. శ్రీకృష్ణపై దాడి చేసినవారిని ముట్టుకోవడం లేదు. పట్టుకొచ్చిన ఆ ఒక్కడికీ రాచమర్యాదలు చేశారు. పోలీసు శాఖ గురించి జనం ఏమనుకుంటారు అన్న ఆలోచన చేయకుండా, మిద్దె ఎర్రిస్వామిని రెండున్నర గంటలపాటు విహార యాత్ర చేయించి మరీ జిల్లా జైలుకు తీసుకెళ్లారు. ఆ కాస్త దూరానికి అంత సమయం ఎందుకు పట్టిందో వెంట వెళ్లిన పోలీసు సిబ్బందిని అధికారుల ప్రశ్నించారా..? అధికార పార్టీవారు కాబట్టి ఆ మాత్రం చేయాల్సిందే అని వదిలేశారా..? ఆ శాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. దాడి చేసినవారు వైసీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల అనుచరులే. పోలీసులపై వారి ఒత్తిడి ఖచ్చితంగా ఉంటుంది. కానీ పోలీసులకు జవాబుదారీ తనం ఉండొద్దా..? అని జనం ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి విషయాల్లో ఎస్పీ అన్బురాజన్ ఎలాంటి ఒత్తిళ్లను పట్టించుకోరని ఆ శాఖ అధికారులు అంటున్నారు. కానీ పోలీసు అధికారులకు ఎమ్మెల్యే, మంత్రి స్థాయికి మించి పై స్థాయి పేషీ నుంచి ఒత్తిళ్లు వచ్చాయేమో అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి.



రైతుల కంట తడి

హంద్రీనీవా ఆయకట్టుకు నీటి బంద్

15 నుంచి చిత్తూరు జిల్లాకు తరలింపు
జిల్లాలో చేతికొచ్చే దశలో పంటలు
మరో తడైనా ఇవ్వకపోతే దిగుబడిపై ప్రభావం
ఆందోళనలో అన్నదాతలు

ఉరవకొండ, ఫిబ్రవరి 23: 'సార్..! పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. మరో తడి ఇస్తే పంట పండుతుంది. మా పొలాల సమీపంలోనే నీరు పారుతున్న మళ్లించుకోలేని దుస్థితి ఉంది. 'పక్కోడి' గొంతు తడపడం కోసం మా మూతులు బిగిస్తారా'? అంటూ హంద్రీనీవా ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలోని 32, 33 ప్యాకేజీలో హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీల కింద 10వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ప్రధానంగా మిరప పంటను వేశారు. 33 ప్యాకేజీలో హంద్రీనీవా డీ2 డిస్ట్రిబ్యూటరీలో ఆరువేల ఎకరాలకు పైగా రైతులు మిరప పంటను సాగు చేశారు. పదిహేను రోజుల కిందట డిస్ట్రిబ్యూటరీలకు అధికారులు నీటిని నిలిపివేసి కాలువకు అడ్డంగా మట్టిని వేశారు. దీంతో పంటలు ఎండిపోతాయని గత్యంతరం లేని పరిస్థితుల్లో కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించు కుని నీటిని వదులుకున్నారు. ఇది ఇలా ఉంటే చిత్తూరు జిల్లాకు నీటిని తరలించేందుకు ఈ నెల 15న డిస్ట్రిబ్యూటరీలకు అడ్డుగా మట్టిని వేసి నీటిని బంద్ చేశారు. పంట ప్రస్తుతం కాయ పండు దశలో ఉందని, నీటిని వదలకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోయారు. కనీసం ఒక్క తడినైనా అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది డిసెంబరులోనూ జీబీసీకి నీటిని మళ్లించే సమయంలో 15రోజులు డీ2 డిస్ట్రిబూటరీకి నీటిని ఆపేశారని, మళ్లీ ఇప్పుడు కాలువకు నీటిని బంద్ చేస్తే మా పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానకాలువలో నీళ్లు ఉన్నా మా పంటలను ఎండబెట్టి పక్క జిల్లాలకు నీటిని తరలించుకు వెళ్తున్నారని వాపోయారు. ఎకరాకు సుమారుగా లక్షన్నర దాకా పెట్టుబడులు పెట్టామన్నారు. నీరు అందని పక్షంలో రైతులు సుమారుగా కోటి రూపాయలు దాకా రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది.



సాగుచేసిన మిరపపంట



డిస్ట్రిబ్యూటరీకి మట్టిని అడ్డు వేసిన అధికారులు



కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు

రెండు తడులు నీరు ఇచ్చి ఆదుకోవాలి



పంట కాయదశలో ఉంది. కనీసం రెండు తడులు నీరు ఇచ్చి ఆదుకోవాలి. 15 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. మరో తడి నీరు ఇవ్వకపోతే కాయరంగు మారి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. గత ఏడాది వర్షాభావం, తెగుళ్ల వల్ల నష్టపోయాం, ఈసారి పంట చేతికొచ్చే సమయంలో నీరు ఆపేస్తే మా పరిస్థితి ఏమిటి?

- ఉమేష్, వ్యాసాపురం

14 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశా



14ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఫిబ్రవరి ఆఖరి వరకూ నీరు ఇస్తే కానీ పంట దక్కని పరిస్థితి. గత ఏడాది కూడా పంటలు దెబ్బ తిన్నా పరిహారం కూడా దక్కలేదు. నీళ్లు ఇవ్వకపోతే ఈ నష్టాలు మరింత పెరగక తప్పవు.

- రాంబాబు, నింబగల్లు

ఎట్ల చేస్తారో చూస్తాం..!

శిలాఫలకంపై మా నాయకుడి పేరు ఉండాల్సిందే
లేకుంటే ఎమ్మెల్యే పద్మావతి, సాంబను రానివ్వం
నార్పల సత్యనారాయణరెడ్డి వర్గీయుల హెచ్చరిక





శిలా ఫలకం ఏర్పాటు స్థలం వద్ద సత్యనారాయణ రెడ్డి అనుచరులు, పోలీసులు

నార్పల, ఫిబ్రవరి 23: కూతలేరు బ్రిడ్జి ప్రారంభోత్సవ శిలాఫలకంలో వైసీపీ నాయకుడు నార్పల సత్యనారాయణ రెడ్డి పేరు ఏర్పాటు చేయకపోతే ఎమ్మెల్యేని, ఆమె భర్తను అడ్డుకుంటామని ఆయన అనుచరులు హెచ్చరించారు. శిలాఫలం ఏర్పాటు పనులను శుక్రవారం అడ్డుకున్నారు. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డికి సత్యనారాయణ రెడ్డి వర్గీయులు సవాలు విసిరారు. నార్పలలో శనివారం జరిగే కార్యక్రమాలు అడ్డగిస్తామని ప్రకటించారు. పట్టణ సమీపంలో కూతలేరు బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యింది. దీంతోపాటు ఫోర్‌వే రోడ్డు పనులు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే, ఆమె భర్త శనివారం వస్తున్నారు. ప్రారంభోత్సవాల నేపథ్యంలో అధికారులు కూతలేరు బ్రిడ్జివద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నించారు. అందులో సత్యనారాయణరెడ్డి పేరు లేదని తెలుసుకున్న ఆయన అనుచరులు అక్కడికి చేరుకున్నారు. శిలాఫలకం పనులు చేస్తున్న కూలీలను అడ్డగించారు. పనులు చేస్తే బాగుండదని హెచ్చరించారు. దీంతో కూలీలు పనులు నిలిపివేశారు. కూలీలు ఆలూరు సాంబశివారెడ్డికి ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలియజేశారు. రెండు గంటలపాటు కూలీలు అక్కడే కూర్చుండి పోయారు. ఆర్అండ్‌బీ అధికారులు అక్కడికి చేరుకోవడంతో సత్యనారాయణ రెడ్డి అనుచరులు వాగ్వాదానికి దిగారు. తమ నాయకుడి పేరు చేర్చకపోతే శిలాఫలకాన్ని కట్టనీయబోమని అన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నడుచుకుంటామని, తమ చేతుల్లో ఏమీ లేదని ఆర్అండ్‌బీ అధికారులు వారికి స్పష్టం చేశారు. ఆ తరువాత పోలీసులు రంగ ప్రవేశం చేసి శిలాఫలకం ఏర్పాటు పనులను ప్రారంభించారు. ప్రజా ప్రతినిధుల పేర్లను మాత్రమే శిలాఫలకాల్లో చేరుస్తారని, సత్యనారాయణ రెడ్డి ప్రజాప్రతినిధి కాదని సాంబ వర్గీయులు అంటున్నారు. పార్టీ నాయకుడు అయినంతమాత్రాన శిలాఫలకంలో చేరుస్తారా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో శనివారం జరగబోయే ఎమ్మెల్యే పర్యటన ఉత్కంఠ రేపుతోంది. వైసీపీలో వర్గపోరు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

26న కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం సభ

పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్



విలేకరులతో మాట్లాడుతున్న శైలజానాథ్

తాడిపత్రి, ఫిబ్రవరి 23: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 26న కాంగ్రెస్ ఎన్నికల శంఖారావ బహిరంగ సభ ఏర్పాటు చేశామని పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ తెలిపారు. తాడిపత్రికి వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్‌తోపాటు జాతీయ, రాష్ట్ర సీనియర్ నాయకులు హాజరవుతారన్నారు. ఈ సభకు కాంగ్రెస్ సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రాయలసీమ అభివృద్ధిని కోరుకొనే వారందరూ హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభలో ప్రధానంగా ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితుల నుంచి కాపాడుకొనేందుకు అనుసరించాల్సిన పలు కీలక అంశాల గురించి చర్చిస్తామన్నారు.

బీజేపీకి వంగివంగి దండాలు పెడుతున్నవైసీపీ

అధికార వైసీపీ నాయకులు బీజేపీ జాతీయ నాయకత్వానికి వంగివంగి దండాలు పెట్టడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేక హోదాను, విశాఖ రైల్వేజోన్‌ను గాలికి వదిలివేసిన బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసినా అధికార పార్టీలో చలనం లేదన్నారు. రాష్ట్రం ఈ దుస్థితికి కారణం కేంద్రంలోని బీజేపీనే అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీని ఎండగట్టకుండా చూస్తున్నారని ఆరోపించారు.

రేపు గ్రూప్-2 పరీక్ష

- అధికారులతో కలెక్టర్ గౌతమి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 23: గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. మొత్తం 32,391 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికోసం జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించామని, ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేసి, పటిష్ట బందోబస్తు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు ఇబ్బంది పడకుండా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష ముగిసే వరకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడాలని అన్నారు. మున్సిపాలిటీలలో కమిషనర్లు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లు బాధ్యత తీసుకుని, పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు ఉదయం 9-30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టరు సూచించారు. వారికి బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ అపరంజని, సెక్షన్ ఆఫీసర్లు నవజ్యోతి, యశోద, డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, అడిషినల్ ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, సీపీఓ అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లా మత్స్యసహకార సంఘం ఎన్నికలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి23: జిల్లా మత్స్యసహకార సంఘానికి సంబంధించిన ఎన్నికలు 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పక్కీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు చేతులు ఎత్తు పద్ధతి ద్వారా నిర్వహిస్తామన్నారు. 27న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11 నుంచి 12 గంటల వరకూ నామినేషన్ల పరిశీలన, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు నామినేషన ఉపసంహరణ, 2 గంటల నుంచి చేతులు ఎత్తు పద్ధతి ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్యసహకార సంఘం సభ్యులు, అధ్యక్షులందరూ ఎన్నికల అధికారి జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును ఎన్నికలకు తీసుకురావాలన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు


ప్రిన్సిపాల్ సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 23: డా. బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ దరఖాస్తు గడువు 28వ తేదీ వరకు పొడిగించినట్లు కురుగుంట పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కురుగుంట పాఠశాలలో ఆమె విలేకర్లకు పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 90 టన్నులు వచ్చాయన్నారు.

సీజీపీ గురుకులంలోకి
అర్ధరాత్రి ఆగంతకులు

- గది కిటికీ అద్దాలు పగులకొట్టిన వైనం
- భయాందోళన చెందిన విద్యార్థినులు
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు



ఆగంతకులు వదలి వెళ్లిన చెప్పులు, సీజీపీ గురుకుల పాఠశాలలో కిటికీ అద్దాలు పగిలిన గది

తనకల్లు, ఫిబ్రవరి 23: మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు వద్ద గిరిజన గురుకుల పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు సుమారు 480మంది బాలికలు విద్యాబోధన చేస్తున్నారు. అయితే గురువారం అర్ధరాత్రి ఆగంతకులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి ఓ గది కిటికీ అద్దాలను రాళ్లతో పగులకొట్టారు. కిటికీ అద్దాలు పగులకొట్టిన గదిలో 9వ తరగతి బాలికలు నిద్రిస్తున్నారు. ఈశబ్దానికి ఆ బాలికలు లేచి భయంతో కేకలు వేశారు. దీంతో రాత్రి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు, సెక్యూరిటీ గార్డు అప్రమత్తమయ్యారు. బాలికల గదికి వెళ్లి విషయాన్ని తెలుసుకుని చుట్టూ గాలించారు. అద్దాలు పగిలిన గది కింది భాగంలో హవాయి చెప్పులు ఉన్నాయే తప్పా.. ఆగంతుకులెవరూ కనిపించలేదు. ఒక్కసారిగా గది కిటికీ అద్దాలు పగలడంతో బాలికలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్, మానటరింగ్ సభ్యుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల కన్వీనర్ పారేసు గురుకుల పాఠశాలను సందర్శించారు. తర్వాత పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివన్నతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ దక్షిణాది రాష్ట్రాల
గౌరవాధ్యక్షుడిగా వెంగమేష్‌చౌదరి



ముదిగుబ్బ, ఫిబ్రవరి23: నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ కౌన్సిల్ దక్షిణాది రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన బాసినేని వెంగమేష్‌చౌదరి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ సంపత్‌కుమార్ నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందాయన్నారు. తాను చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ పదవిని ఇచ్చారన్నారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల గౌరవాధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాహక్కుల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23: ఎస్కేయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్కేయూ పరిపాలనా భవనంవద్ద ఆందోళన చేపట్టారు. వర్సిటీ కార్యదర్శి రాజునాయక్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను పెంచి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని వాపోయారు. హాస్టల్స్‌లో తాగునీరుకూడా అందించకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో పనిచేయించుకుంటున్నారని, వారిని వెనక్కి తీసుకురావాలన్నారు. మూడేళ్లకు పైగా పనిచేసిన డిప్యూటీ వార్డెన్లను తొలగించాలన్నారు. అనంతరం వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య డిమాండ్లతోకూడిన వినతి పత్రమందజేశారు. నాయకులు వంశీకృష్ణ, తిరుమలేష్, కృష్ణ, యమన్న, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.


పరిపాలనాభవనం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

నేడు ఊరంతా ఖాళీ



మాఘపౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని తలారిచెరువు గ్రామం శనివారం ఖాళీ కానుంది. బ్రహ్మహత్య పాప విముక్తి కోసం 403 సంవత్సరాలుగా గ్రామస్థులు ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామమంతా ఖాళీ చేసిన ప్రజలు సమీపంలోని హాజివలి దర్గాలో ఉంటారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి ఎలాంటి దీపాలు గానీ, పొయ్యిలు గానీ ముట్టించకుండా అర్ధరాత్రి వరకు ఉంటారు. అనంతరం ఇళ్లను శుభ్రం చేసుకొని యథావిధిగా దైనందిన కార్యక్రమాల్లో కొనసాగుతారు. - తాడిపత్రి

నేడు కలెక్టరేట్ ఎదుట బెస్తల దీక్ష
శ్రీకృష్ణపై దాడికి నిరసన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 23: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వ్యతిరేకిస్తూ అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన దీక్ష చేపడతామని బెస్తసేవా సంఘం నాయకులు చేపల హరి, కేవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు చేపట్టే నిరసన దీక్షకు ఉమ్మడి జిల్లాలోని బెస్తలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దేవదేవుడి వేడుక

- నేడు కొండమీదరాయుడి రథోత్సవం
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీ


కొండమీద రాయుడు


వేడుకకు సిద్ధమైన రథం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం జరగనుంది. స్వామి వైభవాన్ని కన్నులారా చూసేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ అధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో ఏడో రోజు, మాఘ శుద్ధ పౌర్ణమినాడు స్వామివారు రథంపై విహరిస్తూ.. భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 11:45 గంటల నుంచి 12:30 గంటల వరకు మడుగు తేరును లాగుతారు. అంతకు ముందు వేద పండితులు సర్వజనుల క్షేమాన్ని, శాంతిని ఆకాంక్షిస్తూ రథం వద్ద హోమం నిర్వహిస్తారు. వేకువ జామున లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారికి కల్యాణోత్సవం జరిపిస్తారు. అనంతరం సూర్య ప్రభ వాహనంపై స్వామివారిని అధిష్ఠింపజేసి, పల్లకిలో ఊరేగిస్తూ రథం వద్దకు తోడ్కొని వస్తారు. రథం చుట్టూ ప్రదక్షిణ చేయించి, రథంపై అధిష్ఠింపజేస్తారు. గుమ్మడికాయతో స్వామి, అమ్మవార్లకు దిష్టితీసిన అనంతరం భక్తులు ఆంజనేయ స్వామి ఆలయం వరకూ మడుగు తేరు లాగుతారు. స్వామివారి రథోత్సవం సాయంత్రం 4 గంటలకు మొదలౌతుంది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి బ్రాహ్మణ వీధి వరకు రథాన్ని లాగి.. యథాస్థానానికి చేరుస్తారు. ఇంతటితో రథోత్సవం ముగుస్తుంది. ఈ వేడుకలకు రాయలసీమ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. బుక్కరాయసముద్రంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.


ఏర్పాట్లు పూర్తి

కొండమీదరాయుడి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి పుట్టుశిల అయిన దేవరకొండపైకి వెళ్లడానికి ఆలయ కమిటీ అధ్వర్యంలో పరిమితంగా వాహనాలను ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు దేవరకొండపై తాగునీరు, అన్నప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు, శింగనమల సీఐ శ్రీధర్, పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్తును పర్యవేక్షిస్తారు. అనుమానితులు కనిపిస్తే సెల్ నంబర్ 9440796816, లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అంతేనా..!

పది పాస్ చేయించే ఆలోచనే లేదా..?

- హాస్టల్ విద్యార్థుల భవిత పట్టని అధికారులు
- రెండేళ్లుగా 40 శాతం దాటని ఉత్తీర్ణత
- వైఫల్యాలను అలవాటుగా మార్చుకున్నారు..!
- ఇప్పుడు మేలుకున్నా.. పరిస్థితి మెరుగౌతుంది




బీసీ సంక్షేమశాఖ కార్యాలయం, స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 23: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ పదే పదే అప్రమత్తం చేస్తుంటారు. వార్డెన్లు స్థానికంగా ఉండాలని, స్టడీ అవర్స్‌ను పక్కాగా నిర్వహించాలని కూడా ఆదేశిస్తుంటారు. సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు వార్డెన్లను అప్రమత్తం చేస్తున్నారు. కానీ ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా..? లేదా..? ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. అందుకే రెండేళ్లుగా హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణత దారుణంగా పడిపోతోంది. కొన్ని హాస్టళ్లలో ఒక్కరంటే ఒక్కరూ పాస్ కాలేదు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా.. విద్యా సంవత్సరంలో ఎలాంటి కార్యాచరణా అముల చేయడం లేదు. సంక్షేమశాఖల ఉన్నతాధికారుల నుంచి వార్డెన్ల వరకూ అలసత్వం కనిపిస్తోంది. ఉత్తీర్ణత 40శాతం కూడా దాడటం లేదు. గత వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదు. దీంతో పేదింటి విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోంది.

ఉత్తీర్ణత దారుణం

హాస్టల్ విద్యార్థులు పాసైతే.. అదో అద్భుతం అన్నట్లుగా క్షేత్రస్థాయి పరిస్థితులు ఉన్నాయి. 2022 నుంచి ఉత్తీర్ణత శాతం దారుణంగా ఉంటోంది. 2022లో జిల్లా వ్యాప్తంగా 36 బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 589 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 240 మంది ఉత్తీర్ణత సాధించారు. 349 మంది ఫెయిల్ అయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని 35 వసతి గృహాల్లో 436 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 106 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏకంగా 330 మంది ఫెయిల్ అయ్యారు. ఎస్టీ సంక్షేమశాఖ పరిధిలో రెండు జిల్లాలోని వసతిగృహాల్లో 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... కేవలం 11 మంది ఉత్తీర్ణత సాధించారు. 75 మంది ఫెయిల్ అయ్యారు. ఆ ఏడాది మొత్తం ఉత్తీర్ణత 35 శాతం మాత్రమే. 2023లో గుడ్డిలో మెల్ల అన్నట్లుగా 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండేలా కనిపించడం లేదు. వంద శాతం దేవుడెరుగు.. కనీసం 60 శాతం ఉత్తీర్ణత సాధిస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తూతూ మంత్రం

పది పరీక్షలు సమీపిస్తున్న సమయంలో మాత్రమే సంక్షేమ వసతి గృహాల ఉన్నతాధికారులు అప్రమత్తమౌతారు. అప్పుడు మాత్రమే హడావుడి చేస్తారు. అధికారులు ప్రతి రోజూ ఏదో ఒక హాస్టల్‌ను విజిట్ చేయాలి. విద్యార్థులు ఏ మేరకు చదువుతున్నారో పరిశీలించాలి. వార్డెన్లు అందుబాటులో ఉంటున్నారా...? స్టడీ అవర్స్‌కు టీచర్స్ వస్తున్నారా...? తదితర అంశాలను పరిశీలించాలి. వార్డెన్లతో సమావేశం ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షించాలి. ఉత్తీర్ణతను మెరుగుపరిచేందుకు కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలి. సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఇది విద్యాసంవత్సరం మొదటి నుంచి జరగాలి. పరీక్షలకు ముందు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. కనీసం నెల రోజుల పాటు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. కానీ ఏ సంక్షేమశాఖ వసతి గృహాల్లోనూ ఆ పరిస్థితి కనిపించడం లేదు. విద్యార్థులను గాలికి వదిలేస్తున్నారు. స్టడీ అవర్స్‌ను చాలా హాస్టళ్లలో పక్కన పెట్టేశారు. మరికొన్ని హాస్టల్స్‌లో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం..



జిల్లావ్యాప్తంగా బీసీ వసతిగృహాల్లో 10వ తరగతి విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విద్యార్థులకు పుస్తకాలు, అనంత సంకల్పం పుస్తకాలు అందజేశాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, బాగా చదివేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజూ విద్యార్థుల ఫొటోలు తీసి పంపాలని వార్డెన్లను ఆదేశించాం.

- కుష్బూకొఠారీ, బీసీ సంక్షేమశాఖ డీడీ

నాలుగు నెలలు ముందు నుంచే..



ఏటా ఫిబ్రవరి నుంచి పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తుంటాం. గత ఏడాది నవంబరు నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ప్రతి ఆదివారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. మ్యాథ్స్, సైన్స్ క్వశ్చన్ పేపర్లను నేను ప్రిపేర్ చేసి విద్యార్థులకు అందిస్తున్నా. ఆ క్వశ్చన్ పేపర్లతోనే ప్రతి ఆదివారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆ పరీక్షను సరిగా రాయని వారికి మళ్లీ అదే సబ్జెక్టును బోధించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

- మధుసూదన్‌రావ్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ

ఎన్నికల నిర్వహణకు
సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 23: సాధారణ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్‌స్టేషన్‌లలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తగిన వసతులు కల్పించాలన్నారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ కేంద్రాలు పగడ్బందీగా ఉండాలని సూచించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఎన్నికల సిబ్బందని గుర్తించామని, పీఓలకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి, ఈఆర్‌ఓ శిరీషా,సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకు శిక్షణ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే 1,200 మంది టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీపీయూఎస్ఎంఏ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం కమలానగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో అపుస్మా సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ.. 25వ తేదీ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని శ్రీ 7 కన్వెన్షన్ హాల్‌లో ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. విశాఖపట్టణానికి చెందిన రామునాయుడు, వాణిశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రీ ప్రైమరీ, ప్రైమరీ టీచర్స్ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరామిరెడ్డి, అడ్వైజర్ నాగపీరయ్య, కన్వీనర్ నాగరాజు, గౌరవాధ్యక్షులు నాయుడు, సంజీవరెడ్డి, సూర్యనారాయణ, తేజేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అన్వర్ పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

6.5 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23: గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు ఏడుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ ఈ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని షికారీ కాలనీకి చెందిన షికారి నాగు, షికారి మంజుల, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, బుక్కరాయసముద్రం మండలం రాఘవేంద్ర కాలనీకి చెందిన నిస్సార్ అహ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన ఎర్రతోట లక్ష్మణ్ణ, అదే గ్రామానికి చెందిన పోయింటి ఈరన్నను అరెస్టు చేశామని అన్నారు. షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎర్రతోట లక్ష్మణ్ణ, పోయింటి ఈరన్న నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. కిలో రూ.11 వేలకు కొనుగోలు చేసి, 300 ప్యాకెట్లుగా తయారు చేసుకుంటారని, ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 ప్రకారం గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి తదితర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మూర్తి, లక్ష్మినారాయణ, శివ, రమేష్ బృందంగా ఏర్పడి ఈ ముఠాను పట్టుకున్నారని తెలిపారు. అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


సంఘటన స్థలం వద్ద క్షతగాత్రులు

టైర్ పగిలి వాహనం బోల్తా

- 14మంది కూలీలకు గాయాలు
- అందరూ పశ్చిమబెంగాల్‌కు చెందిన వారే
- యాడికి మండలం వేములపాడు వద్ద ఘటన


గాయపడ్డ కూలీలు

యాడికి, ఫిబ్రవరి 23: మండలంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం కూలీలను తీసుకువెళుతున్న జీపు టైర్ పగిలి బోల్తా పడటంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన 14మంది కూలీలు గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు... పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన తాము కూలి పనుల కోసం వచ్చి తాడిపత్రిలో నివాసం ఉంటున్నామన్నారు. ఈక్రమంలో రాయలచెరువులో అరటి గెలలు కోయడానికి తాడిపత్రి నుంచి జీపులో 17మంది బయల్దేరామన్నారు. వేములపాడు వద్దకు రాగానే తాము ప్రయాణిస్తున్న జీపు టైరు పగిలి వాహనం బోల్తాపడిందన్నారు. కూలీలు అలీ ఇస్లాం, సునిరుత ఇస్లాం, రమణ, సయానా, రంజనా, సాకేత్, ఇస్మాయిల్, ఉమర్‌అలీ, సైమాసనా, అలీమర సలీం, సద్దాం, తఫిక్‌రూత్, ఫయాజ్ అలీ, మహమ్మద్ హుస్సేన్ జీపులో నుంచి ఎగిరి కిందపడ్డట్లు తెలిపారు. ఈ సంఘటనలో గాయపడ్డ కూలీలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.



న్యూ ఐఓసీ డిపోను తనిఖీ చేసిన సీజీఎం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 23: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని న్యూ ఐఓసీ డిపోను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఐఓసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్కే పట్నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఐఓసీ డిపో అభివృద్ధి అంశంలో డ్రైవర్లు, క్లీనర్ల సహకారం ముఖ్యమన్నారు. డిపో అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో ఐఓసీ జీఎం హరినాథ్, గుంతకల్లు డిపో చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్, సీనియర్ మేనేజర్ ప్రసాద్, ఐఓసీ లైసెనర్ నజీర్, ట్యాంకర్స్ డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ అధ్యక్షుడు షెక్షావలి, కార్యదర్శి హనుమేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 23: న్యాయ సేవాధికార చట్టం కింద ప్రజాప్రయోజన సేవల కేసుల్లో ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం న్యాయసేవాసదన్‌లో ప్రజాప్రయోజన కేసుల పరిష్కారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయాధికారి మాట్లాడారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వతలోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికే నల్లప్ప పాల్గొన్నారు.

శ్వేతగజవాహనంపై కొండమీద రాయుడు



గజవాహనంపై విహరిస్తున్న కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 23: కొండమీద రాయుడు స్వామివారి బ్రహ్మోత్సవాలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారు శ్వేత గజవాహనంపై కొండమీద రాయుడు స్వామి విహరించారు. ఉదయం నుంచి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని వివిధ ఆభరణాలుతో అలంకరించి పురవీధుల గుండా చిన్న రథంపై విహరించారు. గజవాహన సేవ శనివారం తెల్లవారుజాము 3 వరుకు నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామి, భూదేవి, శ్రీదేవికి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలు వీడాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి... పదవిలోకి వచ్చాక విస్మరించాడన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం రద్దు చేశారని, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తానని, ఇప్పుడు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నాయకులు మంజునాథ్, ఉమామహేష్, హరికృష్ణ, ఆనంద్, అశోక్, భరత్, కిషోర్, వినయ్, మహమ్మద్ పాల్గొన్నారు.

వైద్యవృత్తిలో విలువలు పాటించాలి



మెడికోలకు సర్టిఫికెట్లను అందిస్తున్న డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం టౌన్ ఫిబ్రవరి 23: వైద్య వృత్తిలో విలువలు పాటించాలని మెడికోలకు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు (ఎంసీఏ) డాక్టర్ ఎస్వీకే ప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మెడికల్‌కళాశాల ఆడిటోరియంలో వైద్యవిద్యార్థులు, హౌస్‌సర్జన్‌లకు వైద్యవృత్తిలో విలువలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విలువలు ధిక్కరించి ఎవరైనా ప్రవర్తిస్తే అలాంటివారి వైద్య సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామన్నారు. కోర్సు పూర్తి అయిన తర్వాత ప్రతిఒక్కరూ మెడికల్ ఎథిక్స్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు మాట్లాడుతూ ఐదున్నరేళ్ల కష్టపడి మీరు నేర్చుకున్న వైద్యాన్ని ప్రజలకు చిత్తశుద్ధితో అందించి వారి ప్రాణాలు కాపాడాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీజీ వైద్యవిద్యార్థులు వెంటనే సూపర్‌స్పెషాలిటీ వైద్యవిద్యను అభ్యసించి వైద్యసేవలు అందించడానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం మెడికోలతో విలువలపై ప్రమాణం చేయించారు. పలువురు డాక్టర్లు, కళాశాలసిబ్బంది పాల్గొన్నారు.

సైకో పాలనను తరిమికొడదాం



మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 23: వైసీపీ సైకో పాలనను తరిమికొడదామని జనసేన రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా అశోక్‌నగర్‌లో పర్యటించి మహిళలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటు వేసి ఉమ్మడి ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ కమతం చంద్రకళ, నగర ప్రధాన కార్యదర్శి కమతం వెంకటనారాయణ, పెండ్యాల చక్రపాణి పాల్గొన్నారు.

మోహన్ కృష్ణకు బంగారు పతకం



మోహన్‌కృష్ణను అభినందిస్తున్న డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23: విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన మోహన్ కృష్ణ బంగారు పతకం సాధించాడు. శుక్రవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు మోహన్‌కృష్ణను అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన మోహన్‌కృష్ణ ప్రతిభ చాటి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

'వికసిత్ భారత్'లో చిత్రవెన్నెలకు తృతీయ స్థానం



అవార్డు అందుకుంటున్న చిత్రవెన్నెల

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23: రాష్ట్రస్థాయి మై భారత్-వికసిత్ భారత్ 2047 డిక్లమేషన్ పోటీల్లో జిల్లాకు చెందిన చిత్రవెన్నెలకు తృతీయ స్థానం దక్కింది. శుక్రవారం గుంటూరులో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో మై భారత్ - వికసిత్‌భారత్ 2047 డిక్లమేషన్ పోటీలలో జిల్లాకు చెందిన చిత్రవెన్నెలకు తృతీయ బహుమతి అందుకుంది. ఎన్‌వైకే రాష్ట్ర డైరెక్టర్ విజయరావు చేతుల మీదుగా రూ.25వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. జిల్లా నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, భరత్‌ల వెన్నెలను అభినందించారు.

అర్బన్ టిక్కెట్ ముస్లింలకు కేటాయించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్‌ను ముస్లిం మైనార్టీలకు కేటాయించాలని ప్రధాన పార్టీలకు ఆ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి నగరంలోని నూర్‌బాషా దూదేకుల భవన్‌లో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తమ డిమాండ్లను పోస్టర్ల రూపంలో ముద్రించి మైనార్టీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 70వేల మందికి పైగా ముస్లిం ఓటర్లున్నారని, అంతటి బలమైన సామాజిక వర్గానికి అనంతపురం అర్బన్‌కు సంబంధించి ముస్లిం మైనార్టీలకు టిక్కెట్ కేటాయిస్తే విజయం చాలా సులువవుతుందన్నారు. మతపెద్దలు హఫీజ్ గులాం రసూల్, హఫీజ్ గౌస్‌పీర్, మహబూబ్ రజా మౌలానా, వలీవుల్లా, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, వలి, జాకీర్, టీడీపీ నాయకులు ఫిరోజ్, సైపుద్దీన్, జాకీర్ పాల్గొన్నారు.

రూ.800 కోట్ల అభివృద్ధి ఎక్కడ ఎమ్మెల్యే గారూ?

● జనసేన జిల్లా అధ్యక్షుడు వరుణ్



నడిమివంకను పరిశీలిస్తున్న టీసీ వరుణ్, జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 23: నగరంలో రూ.800 కోట్లతో అభివృదిచేశానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఆ పనులు ఎక్కడ చేశారో చూపాలని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నడిమివంక పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. ఎప్పుడు చూసినా రూ.800 కోట్లతో నగరాభివృద్ధి చేశానని చెబుతున్న ఎమ్మెల్యే.. నడిమివంక సైడ్ వాల్ నిర్మాణం ఏమైందంటే సమాధానం చెప్పేందుకు నాలుక కరుచుకుంటున్నారని మండిపడ్డారు. నడిమివంకకు సైడ్ వాల్స్ లేకపోవడంతో గత రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు అనేక కాలనీలు మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నడిమివంక సైడ్ వాల్స్ నిర్మిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి, మైనార్టీ నాయకులు నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సిద్దూ, అవుకు విజయ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్‌బాఆషాఆ, నగర కార్యదర్శులు లాల్‌స్వామి, కుమరిఇ మురళీ, ఆకుల అశోక్, అంజి, సంపత్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు జనసేన అండ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ రమణ, అనారోగ్యాలతో మృతి చెందిన టీడీపీ నాయకులు షౌకత్‌ఖాన్, జనసేన నాయకులు గోపాల్ కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ రమణ ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 13వ డివిజన్‌లోని ఉమానగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు షౌకత్‌ఖాన్, జనసేన నాయకుడు పెండ్లిమర్రి గోపాల్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తాగునీటి సరఫరా: నగరంలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉచిత తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం అంబారపు కాలనీలవాసులు హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోటో చేయడంతో టీసీ వరుణ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా కాలనీకి తాగునీటి ట్యాంకర్‌ను పంపారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

● సర్పంచ్ పేరు లేకుండా శిలాఫలకం ఏర్పాటు



బోగినేపల్లి సర్పంచ్ పేరు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

రాప్తాడు, ఫిబ్రవరి 23: మండలంలోని బోగినేపల్లి, పాలచెర్ల గ్రామాలకు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని పాలచెర్ల గ్రామంలో నిర్మించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేశారు. శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాలచెర్లలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని అధికారులు, గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ప్రారంభించిన భవనాల శిలాఫకాల్లో పాలచెర్ల వైసీపీ సర్పంచ్ సుభాషిణి పేరు మాత్రమే నమోదు చేసి బోగినేపల్లి టీడీపీ సర్పంచ్ ఉజ్జినప్ప పేరు లేకుండా ఏర్పాటు చేశారు. దీంతో సర్పంచ్ ఉజ్జినప్ప శుక్రవారం జడ్పీ సీఈఓ నదియాదేవికి ఫిర్యాదు చేశారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా టీడీపీ సర్పంచ్‌ననే ఉద్దేశపూర్వకంగానే పేరు నమోదు చేయలేదని తెలిపాడు. జడ్పీ సీఈఓ రాప్తాడు ఎంపీడీఓ గీతావాణికి ఫోన్ చేసి సర్పంచ్ పేరు శిలాఫలకంలో నమోదు చేయాలని తెలపడంతో సాయంత్రం తాత్కాలికంగా శిలాఫలకంపై తెల్లకాగితంలో సర్పంచ్ పేరు నమోదు చేశారు.

ఇల్లు ఖాళీ చేయమని బెదిరిస్తున్నారు..!

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 22: ప్రభుత్వం పట్టా ఇచ్చిన స్థలంలో తాము ఇల్లు నిర్మించుకున్నామని, ఖాళీ చేయాలని రవిశంకర్ అనే కానిస్టేబుల్ తమను బెదిరిస్తున్నారని బసవతారక నగర్‌కు చెందిన నాగమణి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.నారాయణపురం గ్రామ సర్వే నంబరు 14-2లో 2004లో ఇంటి పట్టా అప్పటి రెవెన్యూ అధికారులు మంజూరు చేశారని ఆమె తెలిపారు. అంతకు ముందే తాము అక్కడ నివాసం ఉంటున్నామని అన్నారు. తన భర్త చనిపోయారని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. 2021లో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రూ.10వేలు చెల్లించి రుణ విముక్తి ధ్రువీకరణ పత్రం తీసుకున్నానన్నారు. ఆ స్థలం తమదని సావిత్రమ్మ, ఆమె భర్త సుబ్బరాయుడు పదేళ్ల కిందట కోర్టుకు వెళ్లారన్నారు. అప్పటి నుంచి స్థల వివాదం కోర్టులో నడుస్తోందన్నారు. ఆ స్థలాన్ని రవిశంకర్ అనే కానిస్టేబుల్ తన భార్య పేరిట కొన్నారని, అప్పటి నుంచి తరచూ కొంత మంది వ్యక్తులతో వచ్చి తనను బెదిరిస్తున్నారని వాపోయారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. తనకు న్యాయం చేయాలని అధికారులకు ఆమె విన్నవించారు.

అక్రమ నియామకాలు రద్దుచేయాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23: ఎస్కేయూలో అక్రమంగా జరిగిన అకడమిక్ కన్సల్టెంట్స్ నియామకాలను రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీసీ హుస్సేన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు మాట్లాడుతూ మాజీ వీసీ రామకృష్ణారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కొంతమందిని అకడమిక్ కన్సల్టెంట్స్‌గా నియమించారన్నారు. నాయకులు మంజునాథ్, ఉమామహేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్స్ జేడీ రాక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ వెంకట క్రిష్ణారెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని మోడల్ స్కూల్స్ సిబ్బందితో ఆయన సమీక్షించనున్నారు. త్వరలో ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల పరిధిలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, టెస్ట్, ఇంటర్ బోధించే పీజీటీలతో ఆయన సమావేశం నిర్వహించనున్నారు. నగర శివారు పంగల్ రోడ్డులో ఉన్న ఆర్డీటీ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు సమీక్ష చేయనున్నారు.

రాక్షస పాలన సాగిస్తున్న సీఎం జగన్

శింగనమల, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో సీఎం జగన్ రాక్షస పాలన సాగిస్తున్నాడని బీజేపీ రాష్ట్ర నాయకుడు చిరంజీవిరెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను జగన్ అందిస్తున్నట్టు ప్రచారం చేసి గొప్పలు చెప్పుకొని ఓటర్లకు గాలం వేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఆలోచించి బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ సాకే శంకర్, ఓబీసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, మండల అధ్యక్షుడు ఓబిరెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

మల్లప్ప ఆలయంలో నగదు చోరీ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 23: కనగానపల్లి మండలంలోని కుర్లపల్లి గ్రామ మల్లప్ప ఆలయంలో గురువారం రాత్రి దుండగులు చొరబడి హుండీ పగలగొట్టి నగదు చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం పూజ చేసేందుకు ఆలయానికి వెళ్లగా తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. అనంతరం ఆలయంలో వెళ్లి చూడగా హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారన్నారు. హుండీలో రూ.35 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

టీడీపీ మహిళా సర్పంచ్‌కు అవమానం

రాప్తాడు, ఫిబ్రవరి 23: గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు. రావడానికి మీకేం అధికారం ఉంది. వెళ్లిపోండి అని వైసీపీ నాయకులు టీడీపీ మహిళా సర్పంచ్‌ను అవమానించారు. మండలంలోని ఎం. చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. టీడీపీ సర్పంచ్ పసుపుల లక్ష్మిదేవి పంచాయతీ కార్యదర్శి ఆహ్వానం మేరకు ప్రారంభోత్సవానికి వెళ్లింది. ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్, ఎమ్మెల్యే, అధికారులు కలిసి సచివాలయం ప్రారంభించాలి. అక్కడ అలా జరగలేదు. ఓ వైసీపీ నాయకుడు మహిళా సర్పంచ్‌ను అవమానించాడు. ప్రారంభోత్సవానికి సర్పంచ్ అవసరం లేదని ఇక్కడకు మిమ్మల్ని ఎవరు రమ్మన్నారని అనడంతో సర్పంచ్ అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థిని ముందు నిలబెట్టి ఎమ్మెల్యే సచివాలయం ప్రారంభించారని సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు.

శుభ్‌కరణ్ సింగ్ హత్య కారకులను శిక్షించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23: యువరైతు శుభ్‌కరణ్ సింగ్ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్రకుమార్, రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమంపై బీజేపీ ప్రభుత్వ ధమనకాండను నిరసిస్తూ శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ రైతుసంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. యువరైతు శుభ్‌కరణ్ సింగ్‌ను కేంద్రమే బలితీసుకుందని విమర్శించారు. ఆయన మృతికి కారణమైన పోలీసులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటనారాయణ, నాగభూషణం, ఏటీఎం నాగరాజు, ఆదినారాయణ, సురేంద్ర, వరలక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, శ్రీనివాసులు, చీమల ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23: వివిధ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 30వేల ఉద్యోగాలను వెంటనే చేయాలని గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు రంగయ్య, రంగస్వామి, గాయత్రి, రాజశేఖర్, చైతన్య పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

గార్లదిన్నె, ఫిబ్రవరి 23: మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం రాత్రి దూదేకుల మస్తాన్ అనే మట్కా బీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కల్లూరులో మట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ గౌస్‌బాషా తనిఖీలు నిర్వహించారు. మస్తాన్‌ను అరెస్ట్ చేసి అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23: పశ్చిమ బెంగాల్ నుంచి తాడిపత్రికి వచ్చిన అరటి గెలల కోత కూలీలు బొలెరో వాహనం అదుపు తప్పి తాడిపత్రి టోల్ ప్లాజా సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన 17 మంది కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఘటనలో గాయపడి జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను శుక్రవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కో క్షతగ్రాతుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సామాజిక సంస్కర్త గాడ్గే



గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23: జంతు బలులకు వ్యతిరేకంగా పోరాడినిక సామాజిక సంస్కర్త గాడ్గే బాబా అని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లింగమయ్య అన్నారు. సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డిభవన్‌లో చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో గాడ్గే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య, రామకృష్ణ, ప్రభాకర్, హరికృష్ణ, నాగప్ప, నాగరాజు, గోవిందరాజులు, ధనుసూరి, భూషణ, వెంకటేశులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛత, విద్య ప్రాధాన్యతను చాటిన గాడ్గే: స్వాతంత్ర్యానికి మునుపే దేశంలో మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఆనాడే పరిశుభ్రత, విద్యా ఆవశ్యకత, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఘనత గాడ్గే బాబాకు దక్కిందని ఏపీ రజకసంఘం నాయకులు అన్నారు. గాడ్గే బాబా 148వ జయంతి సందర్భంగా స్థానిక రజకసంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజకసంఘం జిల్లా అధ్యక్షుడు కసాపురం కృష్ణమూర్తి, లక్ష్మీదేవి, ఎర్రిస్వామి, ఆనంద్, శంకర్, నాగేంద్ర, ప్రసాద్, లక్ష్మీనారాయణ, కాశప్ప, వెంకటనారాయణ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరు

● న్యాక్ కమిటీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23: రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో తమ పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందడంలేదని నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) కమిటీ ముందు చెప్పినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. గురువారం జేఎన్‌టీయూకు చేరుకున్న న్యాక్ బృందం తొలిరోజు వివిధ విభాగాలను పరిశీలించారు. శుక్రవారం కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, ఎన్‌టీఆర్ ఆడిటోరియం, ప్లేస్‌మెంట్స్ ఇలా అనేక విభాగాలతోపాటు ఓటీపీఆర్ఐను పరిశీలించారు. అనంతరం వర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వపు విద్యార్థులు, బోధనేతర సిబ్బందితో వేరువేరుగా సమావేశమయ్యారు. సిలబస్ పూర్తికాకపోయినా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రికార్డుల మీద రికార్డులు రాయిస్తున్నారు. తరగతుల నిర్వహణ తక్కువ ఇలా సమస్యలను కమిటీకి వివరించామని విద్యార్థుల తల్లిదండ్రుల తెలిపారు. అంతకుముందు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల నమూనాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ స్టాల్స్‌ను కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డైరెక్టర్లు, కోఆర్డినేటర్లతోపాటు విభాగాధిపతులు కేఎఫ్ భారతీ, కళ్యాణిరాధ, మమత, అజిత, దిలీప్‌కుమార్, మారాల రామశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



కమిటీకి ప్రదర్శన వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

బాధితులను పరామర్శించిన పరిటాల సునీత



బాధితుల యోగక్షేమాలు విచారిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, ఫిబ్రవరి 23: మండలంలోని పెద్దయ్యగారి కొట్టాల, దుబ్బార్లపల్లి గ్రామాల్లో బాధితులను మాజీ మంత్రి పరిటాలసునీత శుక్రవారం పరామర్శించారు. పెద్దయ్యగారికొట్టాలకు చెందిన రమాదేవి రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్‌గురై మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరిటాలసునీత గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లి భర్త అక్కులప్ప, పిల్లలను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పేరూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డిని దుబ్బార్లపల్లిలో వారి బంధువుల ఇంటి వద్ద ఉండగా అక్కడికివెళ్లి పరామర్శించారు. ఆయన ఇటీవలే గుండెకుచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. పరిటాలసునీత ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, నాయకులు రామ్మూర్తినాయుడు, శ్రీధర్‌నాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు.

నకిలీ ఓట్లను తొలగించాలి: టీడీపీ



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు ఫిబ్రవరి 23: రాప్తాడు నియోజకవర్గం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత మండలంలో డబుల్ ఎంట్రీలను బీఎల్‌ఓలు తొలగిస్తే వాటిని ఆధార్ మార్ఫింగ్‌తో నకిలీ ఓటర్లను జాబితాలో నమోదుచేస్తున్నారని టీడీపీ మండల నాయకులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఫారమ్ 6తో మరోసారి ఓటరు నమోదు చేస్తున్నారని తెలిపారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని సక్రమంగా ఓటరు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి వెంకటనారాయణ, నాయకులు వెంకటేసులు, రాజారమేష్, ఆనంద్, రవితేజరెడ్డి, మురళి, బొమ్మయ్య పాల్గొన్నారు.

చంద్రన్నను సీఎంగా చేసుకుందాం



తిమ్మాపురంలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 23: చంద్రబాబునాయుడును సీఎంను చేసుకుంటేనే మన భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణ చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామంలోని బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. నారాయణచౌదరి మాట్లాడుతూ గ్రామాలలో కలిసికట్టుగా వచ్చి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య, రామ్మూర్తి నాయుడు, మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, చలపతి, కిష్టప్ప, వెంకటేశ్, ఓబుళపతి, ఆదిశేషు, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఆదినారాయణ, ఎస్సీసెల్ వెంకటరాముడు, బలరాముడు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 23: నగరంలోని ఎస్వీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదనరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని నెలల క్రితం న్యాక్ బృందం కళాశాలను సందర్శించి పరిశీలించారన్నారు. అనంతరం కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడింగ్ ఇచ్చినట్లు మెయిల్ ద్వారా సమాచారం పంపారన్నారు. కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చక్రధర రెడ్డి ప్రోత్సాహంతో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐక్యూఏసీ సమన్వయకర్త శ్రీనాథ్, న్యాక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి కృషితో గుర్తింపు లభించిందని హర్షం వ్యక్తంచేశారు.

వైసీపీపై పోరాటం ఆగదు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో ప్రజలను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కాంగ్రెస్ అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి సీపీఐ కార్యాలయంలో ఆయా పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల పొత్తు నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. వారు మాట్లాడుతూ 26వ తేదీన జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. నారాయణస్వామి, శ్రీరాములు, మర్రిస్వామి, బంగారు బాషా పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23: సమస్యల పరిష్కారానికి 27వ తేదీన నిర్వహించే చలో విజయవాడకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని ఏపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ఉద్యోగ,ఉపాధ్యాయులు, కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఒక నిర్దిష్టమైన అజెండా లేకుండా ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఒకటి, రెండుసార్లు చర్చలు జరిపి చాయ్, బిస్కెట్ అంటూ టైంపాస్ చేయాలని జగన్ ప్రభుత్వం చూస్తోందంటూ మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలను వెంటనే అమలు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాగరాజు, డేనియల్, బొమ్మయ్య, సతీష్, సర్దార్ వలి, చిదంబరరెడ్డి, వన్నప్ప శ్రీనివాసులు, ఈరప్ప, పుల్లయ్య, బాల రామ్మోహన్, సంగప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర పునఃనిర్మాణ సభ పోస్టర్ విడుదల

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి23: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 26వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర పునర్నిర్మాణ పోరాట సభ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణంలో విడుదల చేశారు. కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథులుగా మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పోస్టర్‌తో పాటు ప్రచార రథాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణ హక్కులను సాధించుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ప్రధాన లక్ష్యమన్నారు. 26న జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగా సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర సీడబ్ల్యూసీ సభ్యులు హాజరవుతారన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు శ్రీధర్, దాదాగాంధీ, రామానాయుడు, వాసు, ఇమామ్ పాల్గొన్నారు.

గజవాహనంపై రంగనాథుడి దర్శనం


అలంకరణలో దేవేరులతో స్వామివారు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా గజవాహనం వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయమే స్వామి వారిని ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించి, పూజలు చేశారు. రాత్రికి ఉత్సవ విగ్రహాలను అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం, సాయం త్రం రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దేవదాసు ఆలయ అర్చకులు, రవిస్వామి, చేతన్‌వర్మ, లిఖిల్ వర్మ, ఉదయ్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం .. నారసింహుడి కల్యాణం


స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి స్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యారాధన, దీక్ష హోమం నిర్వహించారు. 42 మంది భక్తులకు 18వ దీక్ష మాలధారణ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను నాగుల కట్ట వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ కట్ట వద్దకు తెచ్చి కల్యాణం నిర్వహించారు. తర్వాత ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ వివాహాలకు పట్టణానికి చెందిన పేర్మీ కిరీటప్ప కుటుంబ సభ్యులు దండే విశ్వరాజు, వెల్డింగ్ షాప్ సత్యనారాయణ సంతతి దబ్బడి వెంకటేశులు, సురేష్ గార్మెంట్ వారు మాంగళ్యాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బీటీ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి జీఎన్ నరసింహులు, ఉప కోశాధికారి ఎస్ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, కమిటీ సభ్యులు చిన్న, తిప్పేస్వామి, గురునాథరెడ్డి, కమలాక్షుడు, రామిరెడ్డి, వెంకటరెడ్డి, నరసింహులు, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.7 కోట్లతో ఆలయాల అభివృద్ధి


విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షుడు జీవీ రామన్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని తొండపాడులో వెలసిన మాణిక్య, బొలికొండ రంగనాథస్వామి ఆలయాలను రూ.1.7 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జీవీ రామన్ పేర్కొన్నారు. మాణిక్య రంగనాథ స్వామి కల్యాణ మండపంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రూ.1.7 కోట్లతో నూతనంగా కొండపైకి వెళ్లడానికి మెట్లు, లక్ష్మమ్మ గుడి వద్దకు సీసీ రోడ్డు నిర్మించామన్నారు. కొండపైన రంగనాథ స్వామి దేవాలయంలో గ్రానెట్ వేశామన్నారు. పాత సత్రాలకు మరమ్మతులు చేపట్టామన్నారు. కొండపైకి వెళ్లే భక్తుల కోసం మూడు చోట్ల షెల్టర్లను నిర్మిస్తున్నామన్నారు. సమావేశంలో మాణిక్య రంగనాథ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరె కటికల అభివృద్ధికి కృషి చేస్తాం

మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడు, ప్రభాకర్‌చౌదరి

గుత్తి, ఫిబ్రవరి 23: ఆరెకటికల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. పట్టణంలోని సునామ జకినీ మాత, మాల్యామ జకినీ మాత 21వ వార్షికోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అమ్మవార్లను ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్ దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఆరెకటికలకు అనంతపురంలో ఇంటి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆరెకటికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఆరెకటిక నాయకులు మాజీ ఎమ్మెల్యేలను శాలువ వేసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆరెకటిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్కారి లక్ష్మణ్‌రావు, రాజేష్‌ఖన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీరావు, సుధీర్, టీడీపీ మైనార్టీ నాయకులు సాలార్ బాషా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రావు, కార్యదర్శి సాయినాథ్‌రావు, భాస్కర్‌రావు, బాగ్యరాజు, సాయినాథ్, రామచంద్రరావు, విష్ణువర్ధన్‌రావు, దుర్గారావు, అమర్నాథ్, హరి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

విద్యార్థులకు ఫుల్‌స్టాక్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

గుత్తి, ఫిబ్రవరి 23: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఫుల్‌స్టాక్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణకు విద్యార్థులు హాజరై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సాంకేతిక రంగంలో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అందుకే వీరికి అధిక డిమాండ్ ఉంటుందన్నారు.

కళాశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సూరయ్య, ఏఓ ఇంతియాజ్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ఓటు హక్కును వినియోగించుకోవాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న జితేంద్రగౌడు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 23: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ బీ అరుణ, వార్డు ఇన్‌చార్జ్ నందీశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నా రు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఓట్ ఫర్ సీబీఎన్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కన్న గారి రామాంజనేయులు, హనుమంతు, శీనా, ఫజులు, రాయల్‌వెంకటేష్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వడ్డెర సంఘం జిల్లా కార్యదర్శిగా 'వలిపి'

పామిడి, ఫిబ్రవరి 23: తెలుగుదేశంపార్టీ వడ్డెర సాధికార సంఘం జిల్లా కార్యదర్శిగా తనను నియమించినట్లు వలిపి రామాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకం ఉంచి, జిల్లా కార్యదర్శిగా తనను ఎంపిక చేసేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, జిల్లా, మండల టీడీపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


వలిపి రామాంజనేయులు

ఘనంగా సంత్ గాడ్గే మహారాజ్ జయంతి

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 23: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా రజక సెల్ కన్వీనర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సంత్ గాడ్గే మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ఓబీసీ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ రామాంజనేయులు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యం, సంఘ సంస్కరణ, కుల నిర్మూలన, విద్యాదానంపై సంత్ గాడ్గే చేసిన పోరాటాలు ఎనలేనివన్నారు. స్వయంగా రచించిన కీర్తనలను ఆలపిస్తూ ప్రజలను ఆధ్యాత్మిక ప్రపంచం వైపు నడిపించారన్నారు. అనంతరం రజక చేతివృత్తిదారుల పాదాలు కడిగి శాలువాలు కప్పి పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.


రజక వృత్తిదారులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకృష్ణపై దాడి అప్రజాస్వామికం: ఏపీయూడబ్ల్యూజే

గుంతకల్లు, ఫిబ్రవరి 23: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అప్రజాస్వామికమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం గుంతకల్లులో నియోజకవర్గ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ కమిటీని ఎంపికచేశారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆంధ్రజ్యోతి విలేకరి జీఎం రఫి, కార్యదర్శిగా గుత్తి శేఖర్ గౌడు, కోశాధికారిగా రౌతుల నాగరాజు, గౌరవ సలహాదారుడిగా పుంజా కృష్ణారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వసంత్ కుమార్, ఉపాధ్యక్షులుగా పూర్ణచంద్ర రావు, ఎల్లప్ప, గద్దల మల్లికార్జు, స హాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, సుదీంద్రనాథ్, గోపాల్, అక్బర్ బాషా, శ్రీధర్, నరేశ్‌లను నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ కమిషనర్, ఆర్‌ఓ, బీఎస్ కృష్ణారెడ్డి, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్సు అధ్యక్షుడు గోపా జగదీశ్, తారకేశ్వర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా సంఘ జిల్లా అధ్యక్షుడు జగదీశ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ అయూబ్, కోశాధికారి చౌడప్ప, ఎన్జీవో నాయకుడు లక్ష్మీనారాయణ, విలేకరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పయ్యావుల ప్రవీణ్

టీడీపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయండి

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 23: టీడీపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని దళితవాడలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సమస్యలపై ఆరాతీశారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ మెంబరు చిరంజీవులు, నాయకులు నాగరాజు, రాము, రంగప్ప, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ఆంజనేయస్వామి మాన్యం, పీర్లమాన్యంలో పర్యటన

తాడిపత్రి: పట్టణంలోని ఆంజనేయస్వామిమాన్యం, పీర్లమాన్యం ప్రాంతాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పెండింగ్ లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడతామని ఆయన తెలిపారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను వారికి అంద జేసి ఆరు గ్యారెంటీలను తూ.చ. తప్పకుండా అమలుచేస్తామని వారికి హామీ ఇచ్చారు.


మహిళలతో మాట్లాడుతున్న జేసీ అస్మిత్‌రెడ్డి

బయటపడ్డ విభేదాలు

యల్లనూరు, ఫిబ్రవరి 23: మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆసరా సభకు వైసీపీలోని ఒక వర్గం హాజరుకాగా, మరోవర్గం హాజరుకాలేదు. జడ్పీటీసీ సభ్యుడు భోగాతి వర్గీయులు హాజరుకాగా, ఎంపీపీ గంగావతి వర్గం దూరమైంది. మండలంలో జరిగే ప్రతి సమావేశానికి ఎంపీపీ, సింగిల్ విండో అధ్యక్షుడు హాజరయ్యేవారు. శుక్రవారం జరిగిన సమావేశానికి వీరి వర్గీయులు ఎవరూ హాజరుకాలేదు. సమావేశానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకాకపోగా ఆమె భర్త సాంబశివారెడ్డి హాజరయ్యారు.

నేటి నుంచి హనుమంతరాయస్వామి ఉత్సవాలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 23: మండలంలోని బూదిగుమ్మ గ్రామంలో హనుమంత రాయస్వామి ఉత్సవాలను శనివారం నుంచి రెండు రోజులు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు. శనివారం వేకుజామున గంగపూజ, గోపూజ, శ్రీవారికి పంచామృతాభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన ఉంటుందన్నారు. సాయంత్రం పల్లకి సేవ, గరుడస్తంభ దీపారాధన, రాత్రికి రథోత్సవం ఉంటాయన్నారు. ఆదివారం ప్రాతఃకాల పూజ, అభిషేకం, ఆలయ సమీపంలోని పెన్నానదిలో మాఘ స్నానాలు ముగించుకుని అశ్వత్థదర్శనం, స్వామి దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.


హనుమంతరాయస్వామి మూలవిరాట్

ఘనంగా రంగనాథస్వామి ఉత్సవాలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 23: మండలంలోని శ్రీరంగాపురంలో శుక్రవారం పాండురంగస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గణపతి పుణ్యాహ నాంది ధ్వజస్తంభ పూజలు, శ్రీదేవి, భూదేవి, సమేత రంగస్వామికి పూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున స్వాములవారి కల్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో రథోత్సవ పూజలు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.


ప్రత్యేకాలంకరణలో రంగనాథస్వామి

అయినా పేర్లు మారలేదు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 23: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లినా సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు మాత్రం మారలేదు. గత ఏడాది డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన భోగనగౌడ్ బదిలీపై కళ్యాణదుర్గం వెళ్లారు. కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు ఈ నెలలోనే ఇతర జిల్లాలకు ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లారు. సమాచార హక్కు చట్టం బోర్డులో మాత్రం ఈ ముగ్గురు అధికారుల పేర్లు అలాగే ఉన్నాయి. అధికారులు బదిలీపై వెళ్లినా బోర్డులో పేర్లు మార్చలేదని పలువురు విమర్శిస్తున్నారు.



బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లతో ఉన్న బోర్డు

28న ఎమ్మార్పీఎస్ 'చలో గుత్తి'

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 23: చలో గుత్తి కార్యక్రమాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో సాధించుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 28న గుత్తి సీతారామ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వన్నూరుస్వామి, గోవిందు, తిప్పేస్వామి, సతీష్, హనుమంతు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిరుత హల్‌చల్...

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 23: మండలంలోని వర్లి గ్రామ సమీపంలో చిరుత హల్‌చల్ చేసింది. చిరుతను చూసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు వెళ్లి చిరుతను సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశంలో కొన్ని టపాసులు కాల్చారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు.

జీడిపల్లికి 831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ఔట్ ఫ్లో 750 ఉన్నట్లు వారు వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.465 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు ప్రకటించారు.

మామిడి తోటకు నిప్పు

కూడేరు, ఫిబ్రవరి 23: మండలంలోని కడదరకుంట గ్రామంలో వడ్డే వీరన్న అనే రైతుకు చెందిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. శుక్రవారం రోజున తోటలోకి వెళ్లి చూడగా తోటకు నిప్పు పడటంతో మామిడి పిందెలు, కాయలు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపారు. దాదాపు రూ. మూడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, ఫిబ్రవరి 23: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో శుక్రవారం ఏపీకి చెందిన 32మద్యం బాటిళ్లు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 8 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని పుట్లూరు సర్కిల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామానికి చెందిన రవికుమార్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పెన్నహోబిలంలో తెలంగాణ మాజీ సీఎస్

ఉరవకొండ, ఫిబ్రవరి23: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ని తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్, కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవా రం దర్శించుకున్నారు. ఆలయ ఈవో విజ యకుమార్ అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆయన పేరిట ఆల యంలో ప్రత్యేక పూజలను చేశారు. తీర్థ ప్రసాదాలను అందజే శారు.

నిప్పు రవ్వలు పడి 9 గడ్డి వాములు దగ్ధం

ప్రమాదంలో రూ. 4 లక్షల ఆస్తి నష్టం

డి హీరేహాళ్, ఫిబ్రవరి 23: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు పడి 9 గడ్డివాములు దగ్ధమైన ఘటన శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతులు బుడప్ప, ఆంజనేయులు, డి యర్రిస్వామి, పి సిద్దప్ప, సుంకన్న, వండ్రప్పలకు సంబంధించిన గడ్డివాములు గ్రామ సమీప బయలు స్థలంలో ఒకే చోట వేశారు. గ్రామానికి చెందిన కొంతమంది పిల్లలు ఆ గడ్డివాముల సమీపంలో ఉన్న చెట్టుకు తేనె పట్టు ఉండటంతో దాన్ని విడిపించుకునే క్రమంలో అక్కడ నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో నిప్పు రవ్వలు ఎగిరి గడ్డివాము ల మీద పడ్డాయి. అన్ని గడ్డివాములు ఒకే చోట ఉండటంతో ఒకదాని నుండి మరొక దానికి మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్థులు అక్కడే ఉన్న నీటితో ఆర్పేందుకు ప్రయత్నం చేస్తూ ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే గడ్డివాములు కాలిపోయాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది గ్రామానికి వెళ్లి విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. అగ్నిప్రమాదంలో సుమారుగా రూ. 4 లక్షలు వరకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.


కాలిపోతున్న గడ్డివాములు